క్లుప్తంగా

నేటి విద్యాసంస్థల బంద్‌ను విజయవంతం చేయండి..

జూలూరుపాడు/సుజాతనగర్: విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ బుధవారం జరిగే విద్యాసంస్థల బంద్‌ను జయప్రదం చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి గుగులోత్ వంశీ పిలుపునిచ్చారు. ఈ మేరకు మంగళవారం జూలూరుపాడు, సుజాతనగర్ మండలాల్లో ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి గుగులోత్ వంశీ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడి సుమారు 20 నెలలు కావస్తున్నా పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయలేదన్నారు. తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సాయితేజ, రామ్‌చరణ్‌తేజ, సాయి, దినేష్ పాల్గొన్నారు.

నాలాలపై ఆక్రమణలు తొలగించాలి

సూపర్‌బజార్(కొత్తగూడెం): కార్పొరేషన్ అధికారుల నిర్లక్ష్యం కారణంగా రామవరం సెంటర్‌లో జాతీయ రహదారిపై వరద నీరు నిలిచి కనకదుర్గమ్మ గుడిలోకి వెళ్తోందని ఆటో యూనియన్ జిల్లా కార్యదర్శి మర్రి కృష్ణ, రామవరం యూనియన్ అధ్యక్షుడు ఎస్‌కె జలీల్, నాయకులు భవానీ, ఎస్ జనార్దన్, ఎస్ శ్రీనివాస్, కనకరాజు ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం వారు ఆటో అడ్డా వద్ద మాట్లాడుతూ.. నాలాలను ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వాహనదారులు కూడా తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నట్లు చెప్పారు.

సింగరేణి జీఎం జన్మదిన వేడుకలు


జీఎంను సన్మానిస్తున్న ఏఐటీయూసీ నాయకులు

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం ఏరియాలో జనరల్ మేనేజర్ ఎం.శాలేంరాజు జన్మదిన వేడుకలను మంగళవారం ఏఐటీయూసీ నాయకులు ఘనంగా నిర్వహించారు. జీఎంతో కేక్ కట్ చేయించి, శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు గట్టయ్య, వీరస్వామి, సుధాకర్, కత్తర్ల రాములు, సందెబోయిన శ్రీనివాస్, హుమాయిన్, నాగేశ్వరరావు, బండారి మల్లయ్య, మధుకృష్ణ పాల్గొన్నారు.

విద్యార్థులకు సికిల్‌సెల్ పరీక్షలు

పాల్వంచరూరల్: ఉల్వనూరు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో మంగళవారం పాండురంగాపురం, ఇల్లెందులపాడు తండా ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థులకు రక్తహీనతను గుర్తించడానికి సికిల్‌సెల్ పరీక్షలు నిర్వహించారు. ఎవరికీ రక్తహీనత లేదని ఎంఎల్‌హెచ్‌పీ సునిత తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎన్‌ఎంలు అరుణ, అమ్మక్క, ఎంపీహెచ్‌ఏలు వి.రాంరెడ్డి, శంకర్ పాల్గొన్నారు.


సీజనల్ వ్యాధులను అరికట్టాలి

ఇల్లెందురూరల్: పల్లెల్లో సీజనల్ వ్యాధులు, జ్వరాలు ప్రబలుతున్నాయని నివారణకు వైద్యాధికారులు తక్షణం చర్యలు తీసుకోవాలని పీఓడబ్ల్యూ రాష్ట్ర నాయకురాలు చంద్ర అరుణ కోరారు. పీఓడబ్ల్యూ జిల్లా అధ్యక్షురాలు యదళ్లపల్లి సావిత్రి అధ్యక్షతన మంగళవారం ఏర్పాటైన సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో సరిపడా మందులను సరఫరా చేసి, పల్లెల్లో వైద్యశిబిరాలు నిర్వహించాలన్నారు.

పారిశుద్ధ్య పనులు చేపట్టండి..

పాల్వంచరూరల్: జగన్నాథపురం గ్రామపంచాయతీలో పారిశుద్ధ్య లోపం కారణంగా దోమల ఉధృతి పెరిగిందని, చర్యలు తీసుకోవాలని కోరుతూ.. బహుజన పూజారుల శివశక్తుల సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు బాబూరావు పంచాయతీ కార్యాలయం వద్ద కార్యదర్శి చెన్నకేశవ్‌కు మంగళవారం వినతిపత్రం అందజేశారు. జర్పుల వెంకటేష్, భూక్యా కుమార్, సేవ్యా, శంకర్‌సాదు పాల్గొన్నారు.

నాట్యాచార్యులు మృతి


శాంతిమోహన్ (ఫైల్)

పాల్వంచ: కేటీపీఎస్ రిటైర్డ్ ఉద్యోగి, ప్రముఖ నాట్యాచార్యులు, అభినయ కూచిపూడి నాట్య నిలయం నిర్వాహకులు మారీదు శాంతిమోహన్ వృద్ధాప్యంతో మంగళవారం మృతి చెందారు. ఈయన వేలాది మంది విద్యార్థులకు కూచిపూడి, భరతనాట్యం, ఇతర నృత్యాల్లో తీర్చిదిద్దారు. జాతీయ, రాష్ట్రస్థాయిల్లో అనేక ప్రదర్శనలు స్వయంగా ఇవ్వడంతో పాటు, తన శిష్యులు ప్రదర్శనలు ఇచ్చారు. అనేక అవార్డులు, సత్కారాలు పొందారు. తెలుగు రాష్ట్రాల్లో ఈయనకు అనేక మంది కళకారులు, సినీరంగ కళాకారులతో సత్సంబంధాలు ఉన్నాయి. పట్టణంలోని గోవర్ధనగిరి కాలనీలో ఆయన నివాస వద్ద మృతదేహాన్ని పలువురు ప్రముఖులు, కళాకారులు, ఉద్యోగులు సందర్శించి నివాళులర్పించారు.

వ్యవసాయంలో యాంత్రీకరణ పెరగడంతో సాగులో ప్రతీ పనికి పశువుల స్థానంలో యంత్రాలను వినియోగిస్తున్నారు. ఫలితంగా పశువుల సంఖ్య తగ్గుముఖం పట్టడంతో వాటి వ్యర్థాలతో తయారయ్యే సేంద్రియ ఎరువు వినియోగం కూడా తగ్గుముఖం పట్టింది. దీంతో రైతులు పొలాలకు రసాయన ఎరువుల వినియోగాన్ని పెంచుకుంటూ వచ్చారు. ఇది శృతి మించడంతో నేలసారం, వాతావరణం సమతుల్యతపై ప్రభావం చూపడంతోపాటు పంట దిగుబడులపై తీవ్ర ప్రభావం చూపుతోంది. దీంతో ఎరువుల వినియోగాన్ని దశల వారీగా తగ్గించేందుకు ప్రభుత్వం సంస్కరణలు చేపట్టింది. గుళికల రూపంలో ఉండే యూరియా, డీఏపీ స్థానంలో ద్రవరూప యూరియా, డీఏపీలను అందుబాటులోకి తెచ్చింది.



మార్కెట్‌లో నానో యూరియా, డీఏపీ బాటిళ్లు

‘నానో’తో అధిక దిగుబడులు

- సంప్రదాయ ఎరువుతో పోలిస్తే మెరుగైన ఫలితాలు
- ఎరువు ధర, పంట దిగుబడిలోనూ భారీ వ్యత్యాసం
- రైతుల నుంచి పెరుగుతున్న ఆదరణ


మొక్కజొన్న తోటకు నానో యూరియా పిచికారీ చేస్తున్న రైతు

ఇల్లెందురూరల్: వ్యవసాయంలో మొక్కల ఎదుగుదలకు పోషకాల అవసరం ఎంతో ఉంటుంది. అందుకు నత్రజని అవసరం మరీ ఎక్కువ. మొక్కల శాకీయ పెరుగుదలకు ఈ పోషకం ఎక్కువగా ఉపయోగపడుతుంది. దీనిని యూరియా రూపంలో మొక్కలకు అధికంగా అందిస్తున్నారు. గుళికల రూపంలో ఉండే యూరియాలో నత్రజని 50 శాతం కంటే తక్కువగా ఉంటుంది. దీన్ని అధిగమించేందుకు కొత్తగా ద్రవరూపంలో నానో యూరియా, డీఏపీ అందుబాటులోకి వచ్చింది. నానో యూరియాలో నత్రజని 80 శాతం కంటే ఎక్కువగా ఉంటుంది. 45 కిలోల బస్తా యూరియాలో ఉండే పోషకాలు 500 ఎంఎల్ నానో యూరియాలో ఉంటుంది. అంతేకాకుండా సబ్సిడీ పోను యూరియా బస్తా రైతుకు రూ.266కే లభిస్తుంది. నానో యూరియా లీటర్ బాటిల్ ధర రూ.240కే లభిస్తుంది. ఎకరం విస్తీర్ణంలో బస్తా యూరియా అవసరం అవుతుండగా నానో యూరియా 500 ఎంఎల్ సరిపోతుంది. అంతేకాకుండా బస్తా రవాణాకు, చేనులో యూరియా చల్లేందుకు అవసరమయ్యే కూలీ ధర కంటే నానో పిచికారీ ధర తక్కువగా ఉంటుంది. తద్వారా రైతుకు పెట్టుబడి భారం కూడా భారీగా తగ్గుతుంది.

అధిక ప్రయోజనం...

సంప్రదాయంగా సన్న యూరియాను దశాబ్దాలుగా వినియోగిస్తున్నాం. గుళికల యూరియా ఇటీవల కాలంలోనే అందుబాటులోకి వచ్చింది.

సన్న యూరియా కణ పరిమాణం 2.8 ఎంఎం, గుళికల యూరియా కణ పరిమాణం 4 నుంచి 6 ఎంఎం, నానో యూరియా కణ పరిమాణం 32 నానో మైక్రాన్‌లుగా ఉంటుంది. నానో యూరియాను 125 లీటర్ల నీటిలో అర లీటరు నానో కలపి పిచికారీ చేసుకోవాలి. ఇలా సంప్రదాయ పిచికారీ పద్ధతిలో కాకుండా డ్రోన్‌లను వినియోగిస్తే 350 ఎంఎల్ నుంచి 400 ఎంఎల్ సరిపోతుంది. గుళికల రూపంలోని యూరియా వేరు వ్యవస్థ వద్ద చల్లడం వల్ల మొక్కకు కేవలం 30 శాతం మాత్రమే వినియోగపడుతుంది.

నానో యూరియా మొక్క ఆకులపై పిచికారీ చేసినపుపడు పత్ర రంధ్రాల ద్వారా మొక్కలకు నేరుగా చేరుతుంది. తద్వారా నానో యూరియా మొక్కకు 80 శాతం మేర ఉపయోపడుతుందని వ్యవసాయ శాస్త్రవేత్తలు చెబుతున్నారు. అంతేకాకుండా గుళికల రూపంలోని యూరియా కేవలం 2 నుంచి 3 రోజులు ప్రయోజనం చేకూరుస్తుండగా నానో యూరియా మొక్కకు అవసరమైనప్పుడు మాత్రమే ఉపయోగపడి 8 నుంచి 10 రోజులు ప్రయోజనకారిగా ఉంటుంది.

క్షేత్రస్థాయిలో ప్రచారం...

సంప్రదాయ యూరియా, డీఏపీల కంటే నానో యూరియా, డీఏపీ వినియోగంవల్ల పంట ఏపుగా పెరగడం, అధిక దిగుబడులు అందిచడం వంటి


నానో యూరియా ప్రయోజనాలను వివరిస్తున్న డీఏఓ బాబూరావు (ఫైల్)

ఫలితాలు ఉంటాయని వ్యవసాయ అధికారులు విస్తతంగా ప్రచారం చేస్తున్నారు. ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో ప్రతీ విక్రయ కేంద్రంలోనూ నానో యూరియా, డీఏపీలను అందుబాటులో ఉంచి కొనుగోలు చేసేలా రైతులను ప్రోత్సహిస్తున్నారు. అధిక దిగుబడి, నాణ్యమైన ఉత్పత్తులు వస్తాయని రైతులకు అవగాహన కల్పిస్తున్నారు.

ఏడాది నుంచి వాడుతున్నాం..



నానో యూరియా వల్ల కలిగే ప్రయోజనాన్ని స్వయంగా పరిశీలించాం. గతేడాది పత్తి, మొక్కజొన్న, కూరగాయల పంటలపై పిచికారీ చేసి మంచి ఫలితాలను పొందాం. పెట్టుబడి భారం కూడా తగ్గింది. – సందిరి రమేష్, రైతు, మొండితోగు

రైతులను ప్రోత్సహిస్తున్నాం..



గుళికల రూపంలోని యూరియా కంటే ద్రవరూపంలోని నానో యూరియా మంచి ప్రయోజనకారి. మొక్కలకు నత్రజనిని నేరుగా అస్తుంది. ప్రస్తుత సీజన్‌లోనే వినియోగం పెంచుకునేలా రైతులను ప్రోత్సహిస్తున్నాం. – సతీష్, ఏఓ, ఇల్లెందు

చెక్కులు, రేషన్‌కార్డుల పంపిణీ


చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే కోరం కనకయ్య

ఇల్లెందు: కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు, కొత్త రేషన్ కార్డులను ఎమ్మెల్యే కోరం కనకయ్య చేతుల మీదుగా పంపిణీ చేశారు. మంగళవారం సీఈఆర్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో తహసీల్దార్ కోటా రవికుమార్ అధ్యక్షతన జరిగిన ఈ సభలో 100 మందికి రూ.1,00,116 చొప్పున కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు, నాలుగు వేల మందికి కొత్త రేషన్‌కార్డులను అందజేశారు. కనకయ్య మాట్లాడుతూ.. ఇందిరమ్మ ప్రభుత్వం పేదలకు ఇచ్చిన హామీ ప్రకారం ఒక్కొటీ అమలు చేస్తుందన్నారు. మార్కెట్ కమిటీ చైర్మన్ బానోతు రాంబాబు, ఆత్మ కమిటీ చైర్మన్ బోడ మంగీలాల్ నాయక్, కిన్నెర నర్సయ్య పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ కార్మికులకు పనులు కల్పించండి..

కాంట్రాక్ట్ కార్మికులకు పనులు కల్పించాలని టీయూసీఐ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను కోరారు. మంగళవారం ఇల్లెందులోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద ఆయనను కలిసి వినతిపత్రం అందజేశారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు యాకుబ్‌షావలీ మాట్లాడుతూ.. సింగరేణిలో పని చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులు పనులు లేక తీవ్ర ఇక్కట్లు పడుతున్నారని తెలిపారు. జీకే ఓసీ, జీకే సివిల్, రైల్వే సైడింగ్, సోలార్ పవర్ తదితర డిపార్ట్‌మెంట్‌లలో మ్యాన్‌పవర్ తగ్గించకుండా పాత టెండర్ ప్రకారం సింగరేణి ఉన్నతాధికారులు టెండర్ పిలిచేలా చర్యలు తీసుకోవాలని కోరారు. చిన్న శ్రీను, రామకృష్ణ, శ్రీను, రాజు, ప్రేమ్‌సింగ్, దళ్‌సింగ్, హామీద్ పాల్గొన్నారు.

గెస్ట్ ఫ్యాకల్టీకి ఇంటర్వ్యూలు

పాల్వంచరూరల్/ఇల్లెందురూరల్: లక్ష్మీదేవిపల్లిలోని ప్రభుత్వ డిగ్రీ అటానమస్ కళాశాల, కొత్తగూడెంలోని రామచంద్ర ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల, ఇల్లెందులోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అన్ని సబ్జెక్టుల అతిథి అధ్యాపకుల పోస్టులకు 25న ఉదయం 10 గంటల నుంచి రెండు కళాశాలల ఇంటర్వ్యూలు కొత్తగూడెం శ్రీరామచంద్ర కళాశాలలో నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ పద్మ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పీహెచ్‌డీ, నెట్, సెట్ అర్హత కలిగిన అభ్యర్థులు ఓసీ, బీసీ వారికి పీజీలో 55 శాతం, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 50శాతం మార్కులు ఉన్నవారు మాత్రమే అర్హులని తెలిపారు.

‘ఏకలవ్య’లో వైద్యశిబిరం

టేకులపల్లి: బద్దుతండా గ్రామంలోని ఏకలవ్య రెసిడెన్షియల్ మోడల్ స్కూల్‌లో మంగళవారం సులానగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి కందుల దినేష్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. విద్యార్థులకు వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు.

కేరళ మాజీ సీఎం వీఎస్‌కు నివాళి


నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

సింగరేణి(కొత్తగూడెం): ఆశయం, ఆచరణ కలగలిసిన విప్లవకారుడు అచ్యుతానందన్ అని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పోతినేని సుదర్శన్ అన్నారు. మంగళవారం స్థానిక మంచికంటి భవన్‌లో కామ్రేడ్ వీఎస్ అచ్యుతానందన్ సంతాపసభ నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మాట్లాడుతూ... నిరుపేద కుటుంబంలో జన్మించిన వీఎస్ కమ్యూనిస్ట్ పార్టీలో అనేక పోరాటాలకు నాయకత్వం వహించారన్నారు. మచ్చా వెంకటేశ్వర్లు, అన్నవరపు కనకయ్య, ఎంబీ నర్సిరెడ్డి, కే.బ్రహ్మాచారి పాల్గొన్నారు.

ఘనంగా దాశరథి జయంతి

ఇల్లెందు: పీడిత ప్రజల గొంతుకగా జీవించిన దాశరథి కృష్ణమాచారి జయంతిని ఇల్లెందులో బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మంగళవారం జగదాంబా సెంటర్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కృష్ణమాచారి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తెలంగాణలో కవులు, కళాకారులను బీఆర్‌ఎస్ ప్రభుత్వం సాహితీ పురస్కారం ఏర్పాటు చేసి ఘనంగా సత్కరించినట్లు తెలిపారు. దిండిగల రాజేందర్, జేకే శ్రీనివాస్, ఎస్.రంగనాథ్, ఎండీ జాఫర్ హుస్సేన్, అబ్దుల్ నబీ, జబ్బార్, రాజేష్ పాల్గొన్నారు.

నష్టపరిహారం చెల్లించండి..

సుజాతనగర్: పిడుగుపాటు కారణంగా మేకలను కోల్పోయిన కేసుపాక పుల్లయ్య కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని బీఆర్‌ఎస్ నాయకుడు బత్తుల వీరయ్య డిమాండ్ చేశారు. పార్టీ ఆధ్వర్యంలో బాధితుడు పుల్లయ్య కుటుంబాన్ని మంగళవారం సందర్శించారు. మాట్లాడుతూ.. ఒకేసారి 13 మేకలను కోల్పోయిన పుల్లయ్య కుటుంబ సభ్యులు జీవనాధారం కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం బాధితుడికి న్యాయం చేయాలని కోరారు. అనంతరం పశువైద్యాధికారి కాత్యాయనిని కలిసి సమస్యను వివరించారు. కలెక్టర్‌కు విషయాన్ని నివేదించి పరిహారం వచ్చేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. మామిడాల సాంబశివరావు, గరికె వెంకటనారాయణ, మాచిన శ్రీకాంత్ పాల్గొన్నారు.

లోతట్టు ప్రాంతాలు జలమయం


ఇల్లెందురూరల్: రాఘబోయినగూడెంలో ఇంట్లోకి చేరిన వరద నీరు

ఇల్లెందురూరల్: మండలంలోని పలు గ్రామాలలో మంగళవారం భారీ వర్షం కురిసింది. లోతట్టు ప్రాంతాలను జలమయం అయ్యాయి. పలు ప్రాంతాల్లో వరద ఇళ్లలోకి చేరడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. అంతర్గత రహదారులు చిత్తడిగా మారడంతో ప్రజలు తీవ్రంగా ఇబ్బంది పడ్డారు.

టేకులపల్లి: మండలంలో మంగళవారం మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు ఎడతెరిపి లేకుండా కుండపోత వాన కురిసింది. చింతలతండా – గుండ్లమడుగు మధ్య పుణ్యపువాగు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో ఆర్టీసీ బస్సు నిలిచింది. ఆళ్లపల్లి – టేకులపల్లి – కొత్తగూడెం మండలాలకు రాకపోకలు నిలిచిపోయాయి. తూర్పుగూడెం, రాంపురం వాగుల వద్ద వరద ఉధృతంగా ఉండడంతో రాకపోకలకు అంతరాయం కలిగింది. పలు గ్రామాల్లో డ్రెయినేజీలు లేక వరద నీరు రోడ్లపై పారింది.

ఆత్మలింగేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు


కుంకుమార్చన పూజల్లో పాల్గొన్న భక్తులు

పాల్వంచ: స్థానిక చింతలచెరువు ఆత్మలింగేశ్వరాలయంలో మంగళవారం కోటి కుంకుమార్చన మహాయజ్ఞం ఘనంగా నిర్వహించారు. లలిత సహస్ర పారాయణము, అష్టలక్ష్మి హోమం, లలిత హోమంలో మహిళా భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు. ఆలయ ప్రధాన అర్చకులు జితేందర్ శర్మ ఆధ్వర్యంలో 11 రోజులుగా నిర్వహిస్తున్న పూజలు పూర్ణాహుతితో ముగించారు.

మహిళల ఆర్థికాభివృద్ధికి కృషి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే కూనంనేని

చుంచుపల్లి: మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందడానికి ప్రభుత్వం కృషి చేస్తోందని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. మంగళవారం కొత్తగూడెం క్లబ్‌లో ఇందిరా మహిళా శక్తి సంబరాలను ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన కూనంనేని మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం మహిళల ఆర్థికాభివృద్ధికి పెద్దపీట వేసిందన్నారు. మహిళలకు వడ్డీ లేని రుణాలు, మహిళల సంఘాల ద్వారా ఆర్టీసీ బస్సుల నిర్వహణ, మహాలక్ష్మి పథకం ద్వారా ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణం వంటి పలు మహిళా అభ్యున్నతి కార్యక్రమాలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. గత పదేళ్లలో ఎన్నడూ లేని విధంగా ఇందిరమ్మ ఇళ్ల మంజూరు చేపట్టిందన్నారు. అదేవిధంగా కొత్త రేషన్ కార్డులు, పాత వాటిలో రేషన్ సవరణలు కూడా చేస్తున్నట్లు చెప్పారు. చుంచుపల్లి, లక్ష్మీదేవిపల్లి, సుజాతనగర్, పాల్వంచ మండలాల్లోని మహిళలకు బ్యాంకు లింకేజీ, లోన్ బీమా చెక్కులను పంపిణీ చేశారు. డీఆర్‌డీఓ విద్యాచందన, కొత్తగూడెం ఆర్డీఓ మధు, డీఎస్‌ఓ రుక్మిణి, జెడ్పీ సీఈఓ నాగలక్ష్మి, కొత్వాల శ్రీనివాసరావు, మండె వీరహనుమంతరావు, నాగసీతారాములు, సాబీర్‌పాషా, తహసీల్దార్లు పాల్గొన్నారు.

యువతను విస్మరిస్తున్న పాలకులు

పాల్వంచ: ప్రభుత్వాలే యువతను గంజాయి, డ్రగ్స్, మద్యానికి ప్రేరేపిస్తున్నాయని పీవైఎల్ రాష్ట్ర కార్యదర్శి వాంకుడోతు అజయ్ ఆరోపించారు. మంగళవారం స్థానిక అల్లూరి సెంటర్ వరలక్ష్మి ఫంక్షన్ హాల్‌లో పీవైఎల్ కౌన్సిల్ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు ధరావత్ దేవ పార్టీ జెండాను ఎగురవేశారు. అజయ్ మాట్లాడుతూ.. సమాజ మార్పులో, అభివృద్ధిలో అగ్రభాగాన ఉండే యువతను మనదేశ పాలకవర్గాలు విస్మరిస్తున్నాయన్నారు. యువతను నాశనం చేస్తున్న మత్తు పదార్థాలను నిషేధించాలన్నారు. జిల్లా వ్యాప్తంగా ప్రతీ గ్రామంలో హెల్త్ క్యాంపులు నిర్వహించాలన్నారు. సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి ముద్దా భిక్షం మాట్లాడుతూ.. రాష్ట్రంలోని ఖనిజ సంపదను కార్పొరేట్ సంస్థలకు అప్పజెప్పడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రయత్నాలు చేస్తున్నాయని, వాటిని అడ్డుకునేందుకు యువత ముందుండాలన్నారు. కార్యక్రమంలో గోకినపల్లి ప్రభాకర్, అమర్లపూడి రాము, నూపా భాస్కర్, జాటోతు కృష్ణ, కిషోర్ పాల్గొన్నారు.

విధుల్లో జాప్యం చేయొద్దు..


అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న తుకారాం

ఇల్లెందు: సింగరేణి ఉద్యోగులు తమ విధుల్లో ఎలాంటి జాప్యం చేయవద్దని డీజీఎం (పర్సనల్) తుకారాం అన్నారు. మంగళవారం జీఎం కార్యాలయంలో ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగుల టెర్మినల్ బెనిఫిట్స్, గృహ రుణాల రాయితీ, కారుణ్య నియామకాలు, మెడికల్ బోర్డు తదితర సంక్షేమ పథకాలు, ఉద్యోగుల గైర్హాజరు అంశాలపై సమీక్ష నిర్వహించారు. గనులు, డిపార్ట్‌మెంట్ వారీగా పెండింగ్ ,దరఖాస్తుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. మాట్లాడుతూ.. పెండింగ్ దరఖాస్తులను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ పర్సనల్ మేనేజర్ శ్యాంప్రసాద్, సీనియర్ పర్సనల్ ఆఫీసర్ సుధాకర్, సంక్షేమ అధికారులు ఇక్బాల్ షరీఫ్, అశోక్, అన్ని విభాగాల మినిస్ట్రీయల్ స్టాఫ్ పాల్గొన్నారు.

సీపీఐ మహాసభలను జయప్రదం చేయండి..


జూలూరుపాడు: మాట్లాడుతున్న నరేంద్ర కుమార్

జూలూరుపాడు: 26, 27వ తేదీల్లో అశ్వారావుపేటలో జరగనున్న సీపీఐ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు చంద్ర నరేంద్ర కుమార్ పిలుపునిచ్చారు. మంగళవారం జూలూరుపాడులో జరిగిన సీపీఐ మండల కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. వందేళ్ల సుదీర్ఘమైన పోరాట చరిత్ర కల్గిన సీపీఐ దేశ నిర్మాణంలో బాధ్యతాయుతమైన పాత్ర పోషిస్తోందన్నారు. కార్యక్రమంలో గుండెపిన్ని వెంకటేశ్వర్లు, ఎస్కే నాగుల్‌మీరా, యాసా రోశయ్య పాల్గొన్నారు.

టేకులపల్లి: 26, 27 తేదీలలో అశ్వారావుపేటలో జరగనున్న సీపీఐ జిల్లా మూడో మహాసభను జయప్రదం చేయాలని ఆ పార్టీ టేకులపల్లి మండల కార్యదర్శి గుగులోత్ రామ్‌చందర్ నాయక్ పిలుపునిచ్చారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యదర్శి వర్గం సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశంలో అయిత శ్రీరాములు, ఎజ్జు భాస్కర్, గుగులోత్ శ్రీను, కర్లపూడి సుందర్‌పాల్, జి.సోనీ తదితరులు పాల్గొన్నారు.

సీఎస్ఐ పాత చర్చికి తాళం


చర్చి ఎదుట రోడ్డుపై ప్రార్థన చేస్తున్న భక్తులు

ఇల్లెందు: ఇల్లెందు కోర్టు ఏరియాలో పురాతన 120 ఏళ్ల నాటి సీఎస్ఐ చర్చికి మంగళవారం తాళాలు వేయటంతో భక్తులు కొత్త చర్చిలోకి వెళ్లమని ఆరుబయటే ప్రార్థనలు మొదలుపెట్టారు. చిలికి చిలికి గాలి వానలా మారిన ఈ వివాదం రోడ్డెక్కింది. రూ.కోటి వ్యయంతో మిషన్ స్కూల్ పక్కన ఖాళీ స్థలంలో నూతన చర్చి నిర్మాణం చేశారు. మూడేళ్ల క్రితం పాత సీఎస్ఐ చర్చికి మున్సిపాలిటీ వారు నోటీసులు కూడా జారీ చేశారు. దీంతో నూతన చర్చి నిర్మించి, ప్రారంభించారు. కానీ కొంతమంది తాము పాత చర్చిలోనే ప్రార్థనలు చేసుకుంటామని గేటు బయట రోడ్డు మీద కూర్చోవటం వివాదానికి దారి తీసింది. పాత చర్చికి వెళ్లొద్దని, కొత్త చర్చిలో ప్రార్థనలు చేసుకోవాలని చర్చి కమిటీ కార్యదర్శి తోకల ఏసురత్నం తెలిపారు.

కాంట్రాక్ట్ కార్మికుల వేతనం పెంచాలి

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలకు పెంచాలని, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మంగళవారం కాంట్రాక్ట్ కార్మికులు ఆందోళన చేశారు. నాయకులు మాట్లాడుతూ... గత ప్రభుత్వం కాంట్రాక్ట్ కార్మికులను మోసగించిందని, ప్రస్తుత ప్రభుత్వ వేతనాల పెంపు ప్రకటన కోసం ఎదురు చూస్తున్నారని రాష్ట్ర ప్రభుత్వం తరుపున ఏర్పాటు చేసిన సబ్ కమిటీ వేతనాల ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. ఏప్రిల్‌లో కనీస వేతనాల సలహా మండలి చేసిన సిఫారసులను రాష్ట్ర ప్రభుత్వం అమోదించి గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

ఎరువుల కొరతను నివారించండి..


పాల్వంచ: మాట్లాడుతున్న విశ్వనాథం

పాల్వంచ: జిల్లా వ్యాప్తంగా యూరియా కొరత లేకుండా వ్యవసాయ శాఖాధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని ఏఐకేఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ముత్యాల విశ్వనాథం డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక సీఆర్ భవన్‌లో జరిగిన రైతు సంఘం ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం, వ్యవసాయశాఖ అధికారుల నిర్లక్ష్యాన్ని ఆసరాగా చేసుకున్న కొంత మంది పురుగుల మందుల వ్యాపారులు తమ ఇష్టారాజ్యంగా అధిక రేట్లకు యూరియాను అమ్ముతూ రైతులను దోచుకుంటున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో వీసంశెట్టి పూర్ణచందర్‌రావు, అడుసుమల్లి సాయిబాబా, బండి నాగేశ్వరరావు, ఉప్పుశెట్టి రాహుల్, సుధాకర్, పద్మజ పాల్గొన్నారు.

జూలూరుపాడు: రైతులకు ఎరువులను సబ్సిడీపై అందజేయాలని, యూరియా, కాంప్లెక్స్ ఎరువుల కొరతను నివారించాలని డిమాండ్ చేస్తూ ఏఐయూకేఎస్ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక తహసీల్ ఎదుట ధర్నా నిర్వహించారు. సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బానోత్ ధర్మా మాట్లాడుతూ.. రైతులకు సరిపడా ఎరువులు అందిస్తామని, కొరత లేదని ప్రభుత్వం చెబుతున్నప్పటికీ వాస్తవ పరిస్థితి అందుకు విరుద్ధంగా ఉందన్నారు. యూరియాను బ్లాక్‌లో అధిక ధరలకు విక్రయిస్తున్నారని, అరికట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో లింగాల వీరభద్రం, తోటకూరి నరేష్, బైరు వెంకటేశ్వర్లు, లింగా, సూర్య పాల్గొన్నారు.

ఇల్లెందురూరల్: రైతు అవసరాలకు తగినట్లుగా యూరియా, డీఏపీ సరఫరా చేయాలని, కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని కోరుతూ మాస్‌లైన్ అనుబంధ అఖిల భారత ఐక్య రైతు సంఘం(ఏఐయూకేఎస్) ఆధ్వర్యంలో మంగళవారం వ్యవసాయశాఖ అధికారులకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో అజ్మీర బిచ్చా, భూక్యా పాష, కుంజ సమ్మయ్య, వీరు పాల్గొన్నారు.